కర్నూలు | నంద్యాల
వార్త
31 మార్చి , 2025 సోమవారం పేజీలు 4

## ముస్లిం సోదరసోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు : జిల్లామంత్రులు,ఎంపి, జిల్లా కలెక్టర్, ఎస్‌పి








**నంద్యాల, మార్చి 30, ప్రభాతవార్త పతినిధి** పవిత్రరంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా ఇంచార్జి మంత్రి పయ్యావులకేశవ్, రాష్ట్రన్యాయశాఖ, మైనార్టీ, సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండి. ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలికసదు పాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి.జనార్ధనరెడ్డి, జిల్లా కలెక్టరు రాజకుమారి గణియా, జిల్లా ఎస్‌పి ఆదిరాజ్ సింగ్‌రాణాలు ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జాయింటుకలెక్టరు విష్ణుచరణ్, నంద్యాల ఎంపి బైరెడ్డిశబరి, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఏలు రంజాన్ పండుగ సందర్భంగా పండుగను భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ అల్లాహ్ ఆశీస్సులు, దీవెనలు అందాలని ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాని ఆకాంక్షించారు. పవిత్రత, క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతనల మేళవింపే రంజాన్ పండుగ ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు.

## శ్రీపండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ పంచాంగ శ్రవణం



**శ్రీశైలంప్రాజెక్టు, మార్చి30, ప్రభాతవార్త**
ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకోని శ్రీగిరిక్షేత్రంలో ఉదయం 10.00 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో దేవస్థాన అస్థాన సిద్దాంతి శ్రీపండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞచే రాజమండ్రివారిచే పంచాంగ శ్రవణం గావించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాదికారి యం. శ్రీనివాసరావు, ఉభయదే వాలయాల ప్రధానార్చకులు, వేదపండింతులు, పలు విభాగాల అధికారులు, పలువురు సిబ్బంది ఈ కార యక్రమంలో పాల్గొన్నారు. పంచాంగ శ్రవణం కంటే ముందు లోక కల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు, వేదపండింతులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యనిర్వహణాదికారి దేవస్థానం తరుపున ఆస్థాన సిద్దాంతి శ్రీపండిత బుట్టేవీరభద్ర దైవజ్ఞ వారిని నూతన వస్త్రలతో సత్కరించి పంచాంగ పఠానానికి ఆహ్వానించారు. తరువాత ఆస్థాన సిద్దాంతి శ్రీవిశ్వావసునామ సంవత్సర విశేషాలను వివరించారు. ఈ సందర ్భంగా వారు మాట్లడుతూ ఈసంవత్సరం మంచి వర్షాపాతం ఉంటుదన్నారు. పంటలు బాగా పండుతాయని, దేశం, రాష్ట్రం సుబిక్షంగా ఉంటుందన్నారు. జనులందరికి క్షేమ, ఆరోగ్యాలు కలుగుతాయన్నారు. పాడిపంటలు సమృద్దిగా ఉంటాయన్నారు. గోదుమ, శనగ ధాన్యాలు, పెసలు, ఉలవలు భాగా పండుతాయన్నారు. బంగారు, వెండి రెట్లు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. క్రిడా రంగంలో మంచి విజయాలు ఉంటాయన్నారు. ఈ సంవత్సరం మనదేశంలో రెండు చంద్రగ్రహాణాలు కనిపిస్తాయన్నారు. భాద్రపద పౌర్ణిమ రోజున సంపూర్ణ చంద్రగ్రహాణం, ఫాల్గున పౌర్ణమి గ్రస్తోదయ సంపూర్ణ చంద్రగ్రహణం ఉంటుందన్నారు. ఈ సంవత్సరం సరస్వతి నదికి పుష్కారాలు ఉంటాయన్నారు.

# దీక్షలకు ప్రతిఫలం..రంజాన్..!

ఆత్మ ప్రక్షాళనలో నిత్యం క్రమశిక్షణతో.. దైవానికి అంకితమయ్యే రోజే రంజాన్.. ముఖ్యంగా ఒక రోజులో ఎక్కువ భాగం కఠోర ఉపవాసం చేస్తూసదా దైవ ప్రార్థన.. పేదలను ఆదుకోవాలనే ఉద్భోధ.. సామరసాన్ని చాటే విందులు.. ఇదీ నెల రోజుల దీక్షల ప్రతిఫలమైన ఈద్(రంజాన్) విశిష్టత.. "మానవులు దైనందిన జీవితంలో తమకు సరిపడ్డ ధనం,ఐశ్వర్యంను పొందినప్పుడు వారు సంపాదించిన ధనంనకు సరైన విలువలను ఆపాదించుట కొరకు ఒక క్రమపద్దతిలో తమ సంపాదనను పేదలకు పంచిపెట్టి, దేవుడు సమస్త జీవరాసుల కోసం సంవత్సరంలోని ll నెలలు కేటాయించి ఒక్క రంజాన్ మాసాన్ని మాత్రం తన కోసం పెట్టుకున్నట్లు మహమ్మద్ ప్రవక్త తన సందేశంలో సెలవిచ్చినట్లు ముస్లీం హాజీలు, మత గురువులైన ఇమామ్‌లు తెలియజేస్తున్నారు. అందుకే దీక్షలకు ప్రతి ఫలంగా, నియమ నిష్టలకు ప్రతీకగా రంజాన్ నిలిచిందని చెప్పవచ్చు. ఇందులో భాగంగ సోమవారం ముస్లీం సోదరులు అత్యంత భక్తి శ్రద్దలతో రంజాన్ పండుగను జరుపుకుంటారు".

- పొరుగు వారికి మేలు చేయడమే..

ఈదుల్ ఫిత్తర్ లక్ష్యం..

- నేడు రంజాన్ వేడుక..





**కోసిగి, మార్చి 30, ప్రభాతవార్త :** ఇస్లాం అంటే శాంతి, ధర్మం, ఈ రెండింటిని అనుసరించి అల్లాపై విశ్వాసం ఉంచి తన విధేయతను ప్రకటించిన వ్యక్తినే ముస్లీంగా పిలుస్తారు..ఇస్లాం మూల సిద్దాంతాలు 'కలిమా, నమాజ్, రోజా, జకాత్, హజ్' అనే ఐదు అంశాలను ప్రతి ముస్లీం తప్పక పాటించాలని పవిత్ర ఖురాన్ గ్రంథం చెబుతోంది..రంజాన్ నెల శిక్షణా కాలం వంటిది.. ఈ మాసంలో గడిపిన జీవన విధానాన్ని మిగిలిన 11 నెలల పాటు ఆచరించాలని పవిత్ర ఖురాన్‌లో అల్లా పేర్కొన్నారు..నెల రోజుల కఠిన ఉపవాస దీక్షకు ప్రతి ఫలం అల్లా పండుగ రోజున ఇస్తారని పవిత్ర 'హదీసు'ల్లో ఉంది..నెల మొత్తం ఉపవాస దీక్షలుండి 'షవ్వాల్' నెల మొదటి రోజు చేసుకునే పండుగే రంజాన్ ..ఈ నెలలో కాకుండా షవ్వాల్ నెలలో మొదటి రోజున ఈ పండగను జరుపుకోవడం గమనార్హం..

శుభప్రదమైన పవిత్ర రంజాన్ మాసం విశ్వాసపాత్రులైన మానవులకు దేవుడు(అల్లా) తన కరుణ కటాక్ష వీక్షణలతో ఒదార్చుతాడని ముస్లీంల నమ్మకం. ఆత్మ ప్రక్షాళణ, ఆధ్యాత్మికతను పునరాంకితం చేస్తు వ్యక్తి జీవన విధానంలో చైతన్యాన్ని ప్రేరేపించి క్రమశిక్షణతో దైవానికి అంకితమయ్యే పవిత్రమైన రంజాన్ పండుగ సాటి వారికి సహాయపడాలని నేర్పిస్తుంది. ఉపవాసదీక్ష చివరిరోజు రాత్రి చాలా పరమపవిత్రమైన రాత్రి. ఈ రాత్రి చేసే ప్రార్ధనలు దాని ప్రతిఫలం వెయ్యి రాత్రుల్లో చేసేదానికంటే శ్రేష్టమైన రాత్రిగా లైలాతున్‌ఖదార్‌ను ఆచరిస్తారు. ఈ రాత్రే దివ్య గ్రంధమైన ఖురాన్‌ను మానవులలోని అతి గొప్పవాడైన చిట్టచివరి ముస్లీం ప్రవక్త మహమ్మద్ కొద్దికొద్దిగా ఆకాశంనుండి దేవుని వాక్కుగా "జిబ్రాయిల్ అలైహిస్సాలామ్" అనే దేవదూత ద్వారా వినిపించబడుతాయని మతగురువులు తెలియజేస్తున్నారు. ఇక రంజాన్ మాసం లోని ముప్పై రోజా(ఉపవాసదీక్ష)లను మూడు అంకము(అశ్రా)లుగా విభజించినట్లు పేర్కొంటున్నారు. ఇందులో మొదటి అశ్రా నందు 1నుండి 10రోజులు భగవంతుని యొక్క ..

• వివరాలు 2లో

## విద్యుత్ వాహనాల వినియోగంతోనే.. భవిష్యత్తు తరాలకు భరోసా

– మంత్రి టీజీ భరత్

**కర్నూలు విద్య, మార్చి 30, ప్రభాతవార్త:** విద్యుత్ వాహనాల వినియోగంతోనే భవిష్యత్ తరాలకు భరోసా పాటు భవిష్యత్తు తరాలకు ఆర్థిక భరోసా అందించనుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. స్థానిక బళ్లారి రోడ్డులోని ప్యూర్ ఎలక్ట్రికల్ బైక్ షోరూంను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్యూర్ కొత్త షోరూం స్వచ్ఛమైన మరియు హరిత ఆంధ్రప్రదేశ్‌కోసం ప్రభుత్వ లక్ష్యం సాకారం చేసుకునే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు వేసో ్తందన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. అనుకూల విద్యుత్ వాహనాలను అందించే ఈకీలకమైన కార్యక్రమంలో భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. కర్నూలులో ఈ కొత్త షోరూం పర్యావరణ అనుకూల రవాణా, నమ్మకమైన గృహ ఇంధన ఉత్పత్తులతో ఆంధ్రప్రదేశ్ పౌరులను శక్తివంతం చేయాలనే అంచలమైన నిబద్ధతను ప్రదర్శిస్తుందని ప్యూర్ సహ వ్యవస్థాపకుడు సీఈఓ రోహిత్ వదేరా అన్నారు. ఆయన మాటా ్లడుతూ దేశం యొక్క ఇంధన పరివర్తనను వేగవంతం చేసే గృహాలు వాణిజ్య సంస్థలు మరియు గ్రిడ్‌లకు ఉపయోగపడే ప్యూర్ పవర్ ఎనర్జీ స్టోరేజ్ ఉత్పత్తులను ప్యూర్ ఇటీవల అవిష్కరించిందని అన్నారు. కార్యక్రమంలో మేడిచర్ల శేఖర్, అంగడి మునీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రేమతో..కొట్టుకుందాం..రా..!

- ఆనవాయితీగా ఇదికైరుప్పలలో ఆచారం
- స్వామి వారిపై ఉన్న భక్తినే అంటున్న ప్రజలు




**ఆస్పరి, మార్చి 30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో సోమవారం పిడకల సమరానికి సై అంటూ ప్రేమతో పిడకలతో కొట్టుకుందాం..రా అంటున్నారు. ఇది కైరుప్పల గ్రామంలో ఆరవాయితీగా వస్తున్న ఆచారం. పిడకల సమరం ప్రేమికులను కలపడం ఏమిటని అనుకుంటున్నారా..? ఇది నిజమేనని చెబుతున్నారు కైరుప్పల గ్రామస్తులు. తమ ఇష్టదైవాలను కలిపేందుకే పూర్వం తమ గ్రామస్తులు ఈ యుద్దం సాగించినట్లు వివరిస్తున్నారు. ప్రతి ఏటా ఉగాది పండుగ సంధర్భంగా ఈ ఉత్సవాలను భక్తిశ్రద్దలతో నిర్వహిస్తారు. విహార యాత్రకు వెళ్ళిన వీరభద్రస్వామి తనకు తారస పడిన కాళీకాదేవిని వివాహం చేసుకుంటానని మాట ఇచ్చాడంటా..అయితే ఆ తర్వాత స్వామి మాట తప్పడంతో కాళీకాదేవి వర్గీయులకు తీవ్ర ఆగ్రహం కలిగించింది. తమకు అందుబాటులో ఉన్న పిడకలతో స్వామి వారి వర్గీయులపై దాడికి దిగారు. దీంతో వీరభద్రస్వామి వర్గీయులు సైతం కూడా పిడకలతో ఎదురుదాడికి దిగారు. ఇరువురు వర్గాల మధ్య ఈ దాడి ప్రతిదాడికి రణరంగాన్ని తలపించింది. అయితే నిమ్మకులానికి చెందిన కాళీకాదేవికి అగ్రవర్ణాలకు చెందిన వీరభద్రస్వామితో గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టి వివాహం చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రాణాలకు తెగించి తమ కోసం పోరాడిన తమ వర్గీయులకు వీరభద్రస్వామి, కాళీకాదేవిలు కోరిన కోరికలు తీర్చినట్లు స్థలపురాణం చెబుతుంది. ఆనాటి నుండి నేటి వరకు వీరభద్రస్వామి, కాళీకాదేవి ప్రేమ వ్యవహారం కారణంగా భక్తులు పిడకల సమరం జరుపుకోవడం ఆన వాయితీగా వస్తుంది.

**సమరం ఇలా సాగుతుంది:**
పుప్పాలదొడ్డి, చెన్నంపల్లి, వెంగలాయదొడ్డి, కారుమంచి, కల్లపరి, బిల్లేకల్లు తదితర గ్రామాల ప్రజలు తమ కోరికలు తీర్చిన వీరభద్రుడికకి మొక్కుబడి సమర్పించేందుకు నెల నుండి తమ ఇంట్లో ఉన్న పశువుల పేడతో పిడకలు తయారు చేస్తారు. వాటిని ఉగాది మరుసటి రోజు దేవుడి సన్నిదానికి చేరుస్తారు. భక్తులు రెండు వర్గాలుగా విడిపోయి పిడకలతో కొట్టుకుంటారు. దెబ్బలు తగలకుండా గోన సంచులు ముసుగు వేసుకుంటారు. ఈ పిడకల సమరం అరగంటపాటు వేలాది మంది భక్తుల నడుమ సాగుతుంది. భక్తులు గాయాలకు గురి అవుతారు. గాయానికి స్వామివారి బండారు రాసుకొని ఇంటిముఖం పడతారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది తరలివస్తారు, ఈ ఉత్సవాలలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ డిఎస్పీ వెంకటరామయ్య పర్యవేక్షణలో 50 మంది పోలీసులతో గట్టి భంధోబస్తూ నిర్వహిస్తున్నట్లుగా సి.ఐ. మస్తాన్ వలి తెలిపారు.

## అభివృద్ధిలో నంద్యాల జిల్లా.. అగ్రగామిగా నిలవాలి

- ఘనంగా శ్రీవిశ్వావసు నామ ఉగాది వేడుకలు
- హాజరైన మంత్రులు ఎన్‌ఎండి.ఫరూక్, బిసి.జనార్దనరెడ్డి




**నంద్యాల, మార్చి 30, ప్రభాతవార్త ప్రతినిధి** రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు స్ఫూర్తితో జిల్లా అధికారయంత్రాంగం కష్టపడి సమన్వయంతో పనిచేసి నంద్యాల జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి.జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర న్యాయమైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్.ఎండి.ఫరూక్‌లు ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రులతో పాటు జిల్లా కలెక్టరు జి.రాజ కుమారి, జాయింటుకలెక్టరు విష్ణుచరణ్, ఉన్నతాధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉగాది వేడుకలను ప్రారంభించారు. అలాగే ప్రవీణ్‌కుమార్‌శర్మ, శివకుమార్ శర్మలు ఉగాది పంచాగ శ్రవణం చేశారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని అందరు ఆస్వాదించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారుల నృత్యప్రదర్శనలు అందరినీ అలరింపజేశాయి. ఈ సందర్భంగా మంత్రులు ఎన్‌ఎండి.ఫరూక్, బిసి.జనార్దనరెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత తొలి ఉగాది పండుగ కావడంతో తెలుగువారి సాంప్రదాయం మేరకు నిర్వహించాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సూచనమేరకు ఉత్సవాలను ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించారన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు, సిబ్బంది ఈ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అధికారు లందరినీ ఒక వేదికపైకి తెచ్చిన ఘనత జిల్లా కలెక్టరుకు దక్కుతుందని కొనియాడారు. రాష్ట్రంలో ఆర్థికలోటు ఉన్నా సంక్షేమం అభివృద్ధికి ఎలాంటి ఇబ్బందులు లేకుండ ముందుకు సాగాలని ఉగాది సందర్భంగా భగవంతుని ప్రార్థిస్తున్నామని మంత్రులు తెలిపారు. జిల్లా అభివృద్ధికి జిల్లా అధికారుల సహాయసహకారాలు, ప్రజల ఆశీస్సులు అవసరమని అభిప్రాయపడ్డారు. నంద్యాల జిల్లా పాడిపంటలతో ప్రకృతి సహకారంతో అన్ని విధాలా సమృద్ధిగా ఉందని, ఎక్కడలేని విధంగా జిల్లాలో సహజవనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉపముఖ్యమం త్రి పవన్ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో మరింత అభివృద్దిపథంలోనికి తీసుకువెళ్లడానికి జిల్లా అధికారయంత్రాంగం సహకారం అవసరమని వారు తెలిపారు. జిల్లా కలెక్టరు జి.రాజకుమారి మాట్లాడుతూ తెలుగు సంవత్సరాల్లో 39వది అయిన శ్రీవిశ్వావసు నామ సంవత్సరం. .. విశ్వాన్నే వశం చేసుకున్న శ్రీమన్నారాయణడు అంటే ధనం అన్నారు. నంద్యాల జిల్లా ధన ధాన్యాలతో పాడిపంటలో సుభిక్షంగా వర్ది ల్లాలని ఆకాంక్షించారు. యువత అవకాశాలను అందిపు చ్చుకోవడంతో పాటు జిల్లాను సుసంపన్నంగా ఉండాలని, ప్రజలంతా ఆరోగ్య ంగా, ఆనందంగా, సుఖశాంతులతో ఉండాలని కలెక్టరు మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అధికారులందరు తెల్లచొక్కా, పంచెకట్టు, కండువాలు ధరించి హాజరుకావడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అర్థవంతంగా కవిసమ్మేళనం నిర్వహించిన కవిసమ్మేళణ పండితులైన గెలివిసహదే వుడు, గ్రందేన రేంద్ర, గంగులనాగరాజు, ధోని పూడినరేష్, నీలంవెంకటే శ్వర్లు, కొప్పులప్రసాద్, నీలకంఠమాచారి, మహబుబ్‌బాష, అన్నంశ్రీనివాసరెడ్డి, శేషఫణి, కిషోర్‌కుమార్, రత్నలక్ష్మి, మద్దులేటి, తొగటసురేష్‌బాబులను కలెక్టరు, మంత్రులు అబినంది స్తూ వివిధరకాల ఫలాలు అందించి శాలువలతో సత్కరిం చారు. విశిష్ట సేవలందించిన వ్యవసాయరంగంలో పగి డాలవెంకటేశ్వర్లు, పరిశ్రమల రంగంలో గెలివిరామక్రిష్ణ, క్రీడారంగంలో ఎం.మల్లికార్జున, సామాజికసేవారంగంలో ఎన్.నాగశేషులను ఘనంగా సత్కరించారు. భాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన అదు ్భత నృత్య ప్రదర్శనకు మంత్రి బిసి.జనార్దన్‌రెడ్డి రూ.20వేల నగదు పారితోష కాన్ని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ రామునాయక్, ఆర్‌డిఓ విశ్వనాథ్, ప్రభుత్వశాఖల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా.. మల్లన్న రధోత్సవం..!

## : రమావాణీసేవిత.. రాజరాజేశ్వరి అలంకారం





**శ్రీశైలంప్రాజెక్టు, మార్చి30, ప్రభాతవార్త**
శ్రీగిరిక్షేత్రంలో ఉగాది మహోత్స వముల సందర్భంగా నాల్గవవ రోజైన ఆదివారంనాడు శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు జరిపించబడ్డాయి. ఆ తరువాత స్వామి వారి యాగశాలలో చండ ీశ్వరపూజ, మండపారాధనలు, లోక కల్యాణం కోసం జపానుష్టానాలు రుద్రహోమం నిర్వహించబడ్డాయి. అదే విధంగా ఉదయం అమ్మవారి యాగశాలలో చండీహోమం జరిపించ బడ్డాయి. ఉత్సవములో భాగంగా అమ్మవారికి విశేషకుంకు మార్చనలు, నవావరణార్చనలు చేయడం జరిగింది. కాగా సాయంత్రం 5.30గంటలకు సాయంకాల పూజలు, జపానుష్టానములు జరిపించబడ్డాయి.

**కన్నుల పండువగా మల్లన్న రధోత్సవం:**
ఉగాదిమహోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంకాలం రదోత్సవంలో సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా రధాంగపూజ, రధాంగహోమం, రధాంగబలి, కార్యక్రమాలు జరిపించబడ్డాయి. రధాంగ బలిలో వసంతంతో నింపిన గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, కుంభం (అన్నరాశి) సాత్వికబలిగా సమర్పించబడ్డాయి. తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల రధంపైకి వేంచేబు చేయించి రధోత్సవం జరిపించ బడింది. ఈ రధోత్సవ దర్శనం వలన సర్వపాపాలు తోలగిపోతాయని, కోరిన కోరికలు నెరవేరుతాయని చెప్పబడుతోంది. కాగా రధోత్సవం సందర్భంగా రధానికి విశేషంగా పుష్పా లంకరణ చేయడం జరిగింది. రధోత్సవంలో కోలాటం, చెక్కభజన, జానపద పగటి వేశాల ప్రదర్శన, కేరళ కథాకేళి, తప్పెట చిందు, కర్ణాటక జాంజ్, వీరగాసీ, కోమ్ము వాయిద్యం, కన్నడ జానపదడోలు, నందికోలుసేవ, మొదలైన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది.



**రమావాణీసేవిత రాజరాజేశ్వరీ అలంకారం:**
ఉగాది ఉత్సవాలల్లో చేయబడే శ్రీఅమ్మవారి అలంకారంలో భాగంగా ఆదివారంనాడు అమ్మవారి ఉత్సవమూర్తికి రమావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారం, అలంకారమూర్తికి విశేషపూజలు జరిపించ బడ్డాయి. చతుర్భుజాలు కలిగిన ఈ దేవి పాశం, అంకుశం, పద్మం, చెరుకుగడను ధరించి దర్శనం ఇచ్చారు. ఈ దేవిని దర్శించడం వలన కోరికలు నెరవేరుతాయని, సమస్యలన్నీ తోలగిపోతాయని చెప్పబడుతోంది.





## ఒక గంట చెత్తను ఊడవడానికి రూ..2.5 కోట్లు..!?

**నంద్యాల, మార్చి 30, ప్రభాతవార్త ప్రతినిధి** నంద్యాల జిల్లా అంటే సంచలనాలకు మారుపేరు ఏది చేసినా విచిత్రంగానే ఉంటుంది. ఇక్కడ ఏ శాఖలో చూసిన వింతగానే కనిపిస్తుంది. అయితే అన్నింటికంటే రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మున్సిపాలిటీలో కొన్ని వింతలు విశేషాలు జరుగుతుంటాయి. ఒక గంటపాటు చెత్తను ఊడవడానికి మున్సిపాలిటీ నుండి రూ..2.5 కోట్లు విడుదల చేశారు? వివరాల్లోకి వెళితే.. నంద్యాల మున్సిపాలిటీలో ప్రజలు కౌన్సిలర్లు తమ వార్డుల్లో పని చేపట్టడానికి నిధుల కొరత అంటూ ప్రతిసారి చెప్పడం పరిపాటిగా మారింది. గత పది రోజులు ప్రధాన కూడల వద్ద చలివేంద్రాలు చలువ పందిర్లు వేయించండి అంటూ కౌన్సిలర్లు అడిగితే నిధులు లేవని సమాధానం చెబుతున్నారు. ఇలా అనేక పనులకు అడ్డుకుంటున్న మున్సిపాలిటీ ఒక్క గంట పరిశుభ్రం చేయడానికి రెండు పాయింట్ 50 కోట్లు విడుదల చేశారంటే వినడానికి వింతగానే ఉంటుంది. ఏప్రిల్ 19వ తేదీ శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నంద్యాలకు రానున్నారు. ఇందులో భాగంగా సీఎం ప్రోగ్రాం ఏకంగా హరిజన వార్డుల్లో ఉన్న డంపింగ్ యార్డ్ నందు ఏర్పాటు చేశారు. ఇక్కడ క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాము కోసం మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుండి ఏకంగా రూ.. 2. 50 కోట్లు విడుదల చేశారన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక గంట పాటు చెత్తను ఉడవడానికి ఏకంగా ఇంత డబ్బు ఎలా ఖర్చు పెడుతున్నా రన్నది ఇంతగానే ఉంది.. అసలే ముఖ్యమంత్రి పర్యటన తమకు తెలియదని చెబుతూనే ఇంత డబ్బు ఎలా విడుదల చేశారని పట్టణ ప్రజల్లో ఒక చర్చనీయాంశంగా మారింది

# సుంకులమ్మ అమ్మవారికి.. ప్రత్యేక పూజలు



**వెల్దుర్తి, మార్చి30, ప్రభాతవార్త**
ఉగాది పండుగ పురస్కరించుకొని వడ్డగేరి సుంకులమ్మ అమ్మవారికి వడ్డెరకులస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆదివారం పల్లకిలో పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. మహిళభక్తులు సైతం అమ్మవారి విగ్రహాన్ని ఉంచిన పల్లకిని మోసారు.

**–నేడు అమ్మవారికి బోణాలు:** వడ్డగేరి సుంకులమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం అమ్మవారికి వేకువజామున జలాభిషేకం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ముందుగా ఎస్సీ కాలనీలోని మారెమ్మ అమ్మవారికి బోణాలు తీసుకెళ్లి సమర్పించిన అనంతరం వడ్డగేరిలో ఉన్న సుంకులమ్మ అమ్మవారికి మహిళలు ప్రతి ఇంటి నుంచి పెద్దఎత్తున బోణాలు సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


**–వెల్దుర్తి మండలంలో ఘనంగా ఉగాది వేడుకలు..**
వెల్దుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రధాన ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వేకువ జామున నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరై వారి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పండుగ(తెలుగు సంవత్సరాది) వేడుకలు గ్రామ గ్రామాన జరిగాయి. ఉగాది పచ్చడి చేసుకొని ఇరుగు పొరుగు వారికి పంచి పెట్టారు. పిండివంటలు సైతం చేసుకొని ఆరగించారు. వెల్దుర్తి పట్టణంలోని రామాలయంలో వేదపండితులు అన్నదానం క్రిష్ణశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార ్యక్రమంలో గ్రామపెద్దలు, మాజీ ఎంపిపి బొమ్మనదశరథరామిరెడ్డి, బొమ్మన రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు తదతరులు పాల్గొన్నారు.



## దీక్షలకు ప్రతిఫలం.. రంజాన్..!

**(మొదటి పేజీ తరువాయి ) :** ఆధ్యాత్మికమైన కరుణా దయాళత (రహమ్మత్)గా, రెండో అశ్రా భక్తుల పాపవిముక్తి (మగ్‌ఫిరత్)గా, మూడో అశ్రా భక్తులను నరక బాధలనుండి రక్షించుటకు (జహన్నంసే బచ్‌నే)గా నిర్దేశించబడినది. ఈ రంజాన్ పర్వదినం రోజు ప్రతి ముస్లీం వారి వద్దనున్న సొమ్మును నూటికి రెండున్నర రూపాయలు ప్రకారం సమీకరించుకొని పేదలకు "జకత్" రూపంలో పంచి పెట్టాలి. ఈ జకాత్‌ను పొందుటకు అల్లా కొందరిని మాత్రమే అర్హులుగా నిర్దేశించినట్లు ప్రవక్తలు తెలుపుతున్నారు. వారిలో మొదటి స్థానం 'ఫకీర్ల'కు ఇవ్వబడినది. రెండోస్థానం 'మిష్కిన్' లకు, ఇవ్వబడినట్లు, మూడో స్థానం 'ఎతీమ్'లకు, నాల్గవస్థానం 'ముసాఫిర్'లకు ఇవ్వబడినట్లు, ఐదవస్థానం 'మదరసా'లలో చదివే అనాథ పిల్లలకు ఇవ్వవలసి ఉన్నట్లు వారు సూచిస్తున్నారు. అంతేకాక ఈ పర్వదినాన "ఫిత్రా"(రుసుం)ను తమ వంతు బాధ్యతగా నిరుపేదలకు విధిగా చెల్లించాలి. అలాగే తల్లి గర్భంలో ఉన్న శిశువుకు కూడా తండ్రిగా ప్రతి ముస్లీం ఫిత్రాను చెల్లించివలసియున్నది. రంజాన్ పండుగ రోజు ఉదయాన్నే ఈ ఫిత్రాను నిరుపేదలకు పంచి పెట్టిన తరువాతనే ఈద్గాలకు వెళ్లి ప్రార్దనలు చేయవలసి ఉంటుంది. పండుగ జరుపుకోలేని నిరుపేదలు ఈ ఫిత్రా పైకంతో ఆ పూట కనీసం కడుపునిండాగా తినాలన్నదే దేవుని ప్రణాళికై ఉన్నదని ముస్లీంల విశ్వాసం. అందుకే దీన్ని పరమ నిష్టలతో ముస్లీంలు ఆచరిస్తారు. ముస్లీంలంతా గుమిగూడి 'తస్బి'(ఖురాన్ సూక్తులు) చదువుతూ పండుగ నమాజు(ఈద్గా)కు వెళ్లారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు..

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బైక్ జోన్ దగ్ధం



**బేతంచెర్ల, మార్చి30, ప్రభాతవార్త:** పట్టణంలోని శివశక్తి బైక్ జోన్ నందు ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో లక్షల్లో ఆస్తి దగ్ధమైనట్లు బాధితుడు బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బైక్ జోన్ షాప్‌లో పూజలు నిర్వహించి ఇంటికి వెళ్లగా అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం అందుకుని షాప్ వద్దకు వచ్చినట్లు నిర్వాహకుడు తెలిపారు. అప్పటికే ల్యాప్‌ట్యాబ్, రేడియం స్టిక్కర్లకు సంబంధించిన మిషన్లు, ఇతర సామాగ్రి కాలిపోయాయని వాపోయారు. దీంతో దాదాపుగా రూ.2.30లక్షల ఆస్థి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

## అధికవడ్డీలు చెల్లించలేక అంబులెన్స్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



**నంద్యాల, మార్చి 30, ప్రభాతవార్త_ ప్రతినిధి**
అవసరాలకు చేసిన అప్పులకు అధికవడ్డీలు చెల్లించలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం నంద్యాల పట్టణంలో చోటుచేసుకుంది. నంద్యాల పట్టణంలోని ఉప్పరిపేటకు చెందిన మహేష్ ప్రైవేటు అంబులెన్సు డ్రైవరుగా పనిచేస్తున్నారు. అవసరాలకు చేసిన అప్పులకు చక్రవడ్డీ, బారువడ్డీలు చెల్లించలేక నిద్రమాత్రలు మ్రింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నంద్యాలలో రూ.10 వడ్డీ శృతిమించడంతో ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. నలుగురు వడ్డీ వ్యాపారస్తుల వద్ద రూ.1.5లక్షలు అప్పుచేసి వడ్డీతో సహా రూ.1.5ల క్షలు చెల్లించినా అప్పుతీరలేదు. ఒక వడ్డీ వ్యాపారి రూ.1.5లక్షలు చెల్లించాలని మహేష్‌కు చెందిన స్కూటర్‌ను వడ్డీలోనికి తీసుకున్నారు. బార్య ఆరోగ్యపరిస్థితి బాగా లేకపోవడం చేసిన అప్పులకు అధికవడ్డీలు చెల్లించలేక ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే నిద్రమాత్రలు మ్రింగిన బాధితుడిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. జలగల్లా ప్రజల రక్తం తాగుతూ పదిరూపాయల వడ్డీపేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్న వడ్డీవ్యాపారుల ఆగడాలను అరికట్టాలని ప్రజలు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉగాది పర్వదినాన కిక్కిరిసిన గ్రామ దేవతల ఆలయాలు



**బేతంచెర్ల, మార్చి30, ప్రభాతవార్త:** తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో కొలువైన గ్రామ దేవతల ఆలయాలు ఆదివారం భక్తులతో కిక్కిరిసాయి. తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ప్రజలు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం బేతంచెర్ల పట్టణంలోని శ్రీ సుంకులపరమేశ్వరి ఆలయ ఆవరణంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో క్యూ కట్టారు. అలాగే బలపాలపల్లెలో కొలువైన బీరప్పస్వామి ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిమెంట్‌నగర్ సుంకులపరమేశ్వరి ఆలయం నందు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ప్రముఖ వైష్ణవక్షేత్రమైన మద్దిలేటిస్వామి క్షేత్రంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను విడుదల చేయడం జరిగింది. సాయంకాలం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు తెలుగు పంచాంగాన్ని చదివి వినిపిస్తూ రాశి ఫలాలు, ధాన్యాల ఉత్పత్తులు ధరల విషయాలను, వాతావరణ పరిస్థితులను పట్టణ ప్రముఖులకు, ప్రజలకు వివరించారు.



## ఉగాది పండుగ రోజు పాండురంగ చౌదరి కాంప్లెక్స్‌కు కళ

**: కార్పోరేట్ తరహాలో మొదటిసారి ఆత్మకూరుకు వ్యాపారం**
**: మోర్ బజార్‌ను ప్రారంభించిన 16వ వార్డు కౌన్సిలర్ కురుపాటి విజయ్‌చౌదరి**



**ఆత్మకూరు, మార్చి30, ప్రభాతవార్త:** ఉగాది పండుగ రోజు పట్టణంలోని స్వర్గీయ మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పాండురంగ చౌదరి కాంప్లెక్స్‌లో నూతనంగా ప్రారంభమైన మోర్ బజారుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆదివారం ఆ ప్రాంతం అంతా కళకళాడింది. నల్లమల గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేసేందుకు మోర్ బజార్ రాకతో ప్రజలు పెద్దఎత్తున్న తమకు కావాల్సిన నిత్యావసర సరుకులకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ముందుగా ఈ మోర్ ప్రారంభోత్సవానికి 16వ వార్డు కౌన్సిలర్ కురుపాటి విజయ్‌చౌదరి దంపతులు ముఖ్య అతిధులుగా హాజరై మోర్ బజార్‌ను ప్రారంభించారు. మొదటి రోజు ఊహించని వ్యాపారం జరిగిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మోర్ బజారులో దాదాపు 5వేలకు పైగా నిత్యావసర సరుకులను అందుబాటులోకి తీసుకోని వచ్చారు. వీటితో పాటు తాజాగా ఉండే కూరగాయాలు, పండ్లు, వివిద రకాల డ్రైఫ్రూట్స్, అన్ని రకాల నిత్యావసర సరుకులను సరళమైన ధరలకు అందించి పర్సెంటెజ్‌లతో కస్టమరులను ఆకట్టుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోని నల్లమల ప్రాంతంలో పాండురంగ చౌదరి కాంప్లెక్స్ ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా మోర్ బజారు రాకతో ప్రజలు తమ కుటుంబాలతో తరలి వచ్చి కావాల్సిన నిత్యావసర సరుకులను కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో శాలిపైల్వాన్, మోర్ బజారు నిర్వహకులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గోన్నారు.

## మిత్రుని కుటుంబాన్ని ఆదుకున్న 1999-2000వ బ్యాచ్ పదోతరగతి పూర్వపువిద్యార్థులు

**– మిత్రుని కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసహాయాన్ని అందించిన పదోతరగతి పూర్వపువిద్యార్థులు**




**వెల్దుర్తి, మార్చి30, ప్రభాతవార్త :** తనతో పాటు చదువుకున్న తోటి స్నేహితుడు సి.రామాంజనేయులు అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన ఇటీవల వెల్దుర్తి మండలంలోని చెరుకులపాడు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన చెరుకులపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న 1999-2000వ బ్యాచ్ పదోతరగతి పూర్వపువిద్యార్థులు(తోటి మిత్రులు) ఆ కుటుంబాన్ని తమ వంతుగా ఆదుకోవాలని నిర్ణయించారు. వీరంతా కలిసి ఉగాది పర్వదినం రోజైన ఆదివారం మిత్రుని ఇంటికి వెళ్లి మిత్రుని కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. తమ వంతుగా ఆ కుటుంబానికి రూ.50వేల రుపాయలు నగదును ఆర్థికసహాయంగా అందించారు. ఏ కష్టం వచ్చిన తామున్నామని మరువవద్దని ఆకుటుంబానికి వారు భరోసా ఇచ్చారు. సాయం చేసిన వారిలో శివమాధవులు, రామాంజనేయులు, చిన్నరంగుడు, పెద్దరంగడు, రామలింగయ్య, వెంకట్రాముడు, పెద్దమాదన్న, ఎల్లనాగన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు ఈద్ రేషన్ కిట్లను పంపిణీ చేసిన జమాతే ఇస్లామి హింద్



**బనగానపల్లె, మార్చి30, ప్రభాతవార్త:** రంజాన్ మాసాన్ని పురస్కరించుని పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు ఈద్ రేషన్ కిట్లను పంపిణీచేసినట్లు జమాతే ఇస్లామి హింద్ బనగానపల్లె శాఖ అధ్యక్షులు ఎం.ఎం. అలీ బేగ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 260 మంది నిరుపేదలకు దాదాపు రూ.2లక్షలు విలువైన ఈద్ రేషన్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలియజేశారు. ఒక్కొక్క ఈద్ రేషన్ కిట్ విలువ రూ.800లు చేస్తుందని వాటిని జమాత్ సభ్యులు పేదల ఇంటి వద్దకు వెళ్లి అందించడం జరిగిందని ఆయన తెలిపారు. సమాజంలోని నిరుపేదలను ఆదుకోవడంలో జమాతే ఇస్లామి హింద్ ఎప్పుడు ముందుంటుందని అలీబేగ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ సభ్యులు పాల్గొన్నారు.

## మద్దిలేటి లక్ష్మినరసింహస్వామికి వెండి నగల వితరణ



**బేతంచెర్ల, మార్చి30, ప్రభాతవార్త:**
ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహస్వామికి ఆవుల మద్దిలేటి, తులశమ్మ దంపతులు ఆదివారం వెండి నగలను వితరణ చేసినట్లు ఆలయ సిబ్బంది, వేదపండితులు తెలిపారు. స్వామి వారి పూజా కైంకర్యాల కోసం వినియోగించే పంచపాత్ర, వెండి కిరీటాన్ని దాతలు సమర్పించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వేదపండితులు కళ్యాణ చక్రవర్తి, జ్వాల చక్రవర్తి, ఆలయ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో దాతలకు స్వామి అమ్మవార్ల పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

## ఏప్రిల్ 1 నుండి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం

**బనగానపల్లె, మార్చి30, ప్రభాతవార్త:**
ఏప్రిల్ 1వ తేది నుండి దివ్యాంగుల పెన్షన్ వెరిఫికేషన్ సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతున్నాయని బనగానపల్లె ఎంపిడివో బి.వి.రమణ తెలిపారు. జనవరిలో విడుదల కావాల్సిన సదరం స్లాట్‌లు నిలిపివేయబడ్డాయని దివ్యాంగ సంఘాల విజ్ఞప్తి మేరకు వెరిఫికేషన్‌తోపాటు స్లాట్‌లు తిరిగి ప్రారంభించి అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ స్లాట్‌లు ఎంపిక చేయబడిన ఏరియా, జిల్లా, టీచింగ్ ఆసుపత్రులు, జీజీహెచ్‌లలో ప్రతి మంగళవారం అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. కావునా ఈ అవకాశాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో రమణ తెలియజేశారు.

## గోనెగండ్లలో ఘనంగా ప్రభోత్సవం



**గోనెగండ్ల, మార్చి, 30, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, మహిళలు ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని సీతీరామదేవాలయం, సుంకులా పరమేశ్వరి, మారెమ్మ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వావసునామ సంవత్సరం ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ గ్రామ పెద్దలు దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే చింతాలముని నల్లారెడ్డి దేవాలయం నందు ఉదయం నుంచి భక్తులు పూజా కార్య క్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తులసి ఆర్చన, ఆకుపూజ, మహా మంగళహరతి పల్లకి సేవ నిర్వహించారు. అలాగే శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వబ్రాహ్మనులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోనెగండ్ల తో పాటు గాజులదిన్నె, హెచ్ కైరవాడి, కులుమాల, వేముగోడు, పుట్టపాశం, బైలుప్పల, అగ్రహారం, అలువాల గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గోనెగండ్లలో అంజనేయస్వామి దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు ప్రభోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో కోలాటలు, పాటలు, ప్రజలకు ఎంతో ఆకట్టుకున్నాయి. వీరశైవ మఠం ఫీఠాధిపతి శివయ్యస్వామి పల్లకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో గ్రామ పెద్దలు డిప్యూటీ తహశీల్దార్ గురురాజారావు, భాస్కర్‌రెడ్డి, గొవింద్, దొరబాబు, శివరాముడు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వల్లేలాంబ దేవి తిరుణాల రథోత్సవ వేడుకలు



**కోడుమూరు, మార్చి 30, ప్రభాతవార్త :** కోడుమూరు పట్టణ హంద్రీ నది ఒడ్డున వెలసిన శ్రీ వల్లేలాంబ దేవి తిరుణాల రథోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా సాగింది. ఈ రథోత్సవ వేడుకలను ఆలయ ధర్మకర్త బరుసు రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ వేడుకలను తిలకించేందుకు కోడుమూరు మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలొచ్చి అమ్మవారి జాతర ఉత్సవాలను తిలకించారు. రథోత్సవ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కోడుమూరు పోలీసులు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పూలవాసు, సాలప్ప, జీతూరి ప్రవీణ్‌కుమార్, క్రిషా ్ణరెడ్డి, రవికుమార్‌రెడ్డి, కరెంట్ మల్లారెడ్డి, సన్నాఫ్ కాశన్న రవికుమార్, శ్రీను, బి.నాగరాజు, స్వామి, రాముడు, ఎస్.జి దామోదర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2 నుండి రిజిస్ట్రేషన్ కొరకు స్లాట్ బుకింగ్

**కల్లూరు, మార్చి 30, ప్రభాతవార్త:**
కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు ఏప్రిల్ 2 నుండి రిజిస్ట్రేషన్ కొరకు కొత్తగా స్లాట్ బుకింగ్ సౌకర్యం రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్‌ల శాఖ విజయవాడ ఉత్తర్వుల మేరకు కర్నూలు జిల్లా మరియు ఉప ఇన్‌స్పెక్టర్ జనరల్ అధికారిని కళ్యాణి అదేశానుసారం సులభంగా రిజిస్ట్రేషన్ తేదిని అన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ప్రారంభించనున్నారు. ప్రజలు తమ విలువైన సమయాన్ని రిజిస్ట్రేషన్ కొరకు కార్యాలయం నందు సమయాన్ని వృధాచేసుకోకుండా తాము కోరుకున్న సమయానికే రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ఈస్లాట్ బుకింగ్ ఎంతో ఉపయోగపడుతుందని, అలాగే రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయం ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.30 వరకు చేసుకోవచ్చని ప్రజలు తాము నిర్ణయించుకున్న రోజు సమయానికే అన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్‌చేసుకునే అవకాశం కల్పించడం జరిగింది. కావునా ప్రజలు ఈసదవకాశాన్ని వినియోగించుకోవాలని కర్నూలు సబ్ రిజి స్ట్రార్ ప్రకటనలో తెలియజేయడమైంది.

## శ్రీకాళిమాత ఆలయంలో అలరించిన పంచాంగ శ్రవణం




**ఆళ్లగడ్డ, మార్చి 30, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డపట్టణంలోని శ్రీకాళిమాత ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి వేదపండితులచే పంచాంగశ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్య వాస్తు పండితులు జివేశ్వర శాస్త్రీ హాజరయి విశ్వావసునామ సంవత ్సర రాశిఫలాలు భక్తులకు వివరించారు. అనంతరం శ్రీకాళిమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు దురుగడ్డ రవీంద్రాచారి సావిత్రమ్మ దంపతుల ఆధ్వర్యంలో పంచాంగశ్రవణ కర్త జీవేశ్వర శాస్త్రీ శాలువ మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో మహిళా కమిటీ అధ్యక్షురాలు అనురాధ, ఉపాధ్యక్షులు కృష్ణామాచారి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది వృత్తిలో రాజీ లేకుండా శ్రమించే వ్యక్తి కంచర్ల గోవిందరెడ్డి

**: స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా**

**ఆత్మకూరు, మార్చి30, ప్రభాతవార్త:** బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నియమితులైన ప్రముఖ సీనియర్ న్యాయవాది ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గోవిందరెడ్డిని ఆత్మకూరు స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా వారి బృందం పట్టణంలోని న్యాయవాది గోవిందరెడ్డి నివాసంలో శాలువ, పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా మాట్లాడుతూ గొప్ప సంకల్పం ఉన్న వ్యక్తి గోవిందరెడ్డి అన్నారు. టిడిపి పార్టీ పట్ల ప్రతి కార్యక్రమంలో చురుగా పాల్గొని ఆయన ఇచ్చే సందేశాలు యువత స్పూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ డైరెక్టర్ మొహమ్మద్ షాహిద్, తైక్వాండో గౌరవ అధ్యక్షులు అసదుల్లా, ఖోఖో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు టైగర్ బాబు, స్పోర్ట్స్‌క్లబ్ సభ్యులు అర్షద్, పాన్ మహమ్మద్ పాల్గోన్నారు.



# సెలవుల్లోనూ.. రిజిస్ట్రేషన్ సేవలు

**- ఆది, సోమవారాల్లోను రిజిస్టర్ కార్యాలయంలో విధులు..**

**కోసిగి, మార్చి 30, ప్రభాతవార్త**
ప్రభుత్వ సెలవుల్లోనూ రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ప్రభుత్వం రిజిస్టర్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేయడంతో ఆదివారం సెలవు రోజైనప్పటికి రిజిస్టర్ కార్యాలయంలో సేవలను అందించారు.. అలాగే సోమవారం రంజాన్ పండుగ సెలవు ఉన్నపన్పటికి రిజిస్ట్రేషన్ పనులు చేసుకునేందుకు వీలుగాసోమవారం కూడా రిజిస్టర్ కార్యాలయం తెరిచి ఉంటుందని సబ్ రిజిస్ట్రార్ బజారి తెలిపారు.. కావున ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగంచేసుకుని రిజిస్ట్రేషన్‌కు రావాలన్నారు..రెండు రోజులు ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికి రిజిస్ట్రేషన్ కమీషనర్ ఆదేశాల మేరకు తాము సెలవుల్లో విధులునిర్వహిస్తున్నట్లు తెలిపారు..రోజు మాదిరిగానే ఉదయం నుండి సాయంత్రం వరకు కార్యాలయం తెరిచి ఉంటుందని, కావున రిజిస్ట్రేషన్ సేవలను ఈసమయంలో వాడుకోవచ్చన్నారు.. కాగా ఆదివారం అయినప్పటకి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కక్షిదారులు ముందుకు వచ్చారు..



ఉగాది నాడు రిజిస్ట్రేషన్‌చేయించుకుంటే తమకు మంచిదని పలువురు తెలిపారు..దీంతో పండుగ రోజు కూడా రిజిస్ట్రేషన్ సేవలను అందించడం మంచిదేనన్నారు.. సెలవు రోజుల్లోఈ కార్యాలయం ప్రాంతం బోసిపోయి ఉంటుంది.. దీనికి తోడు డాక్యుమెంట్ రైటర్లు కూడా ఉండక పోవడంతో ఇక సెలవు రోజులో ్ల ఈ కార్యాలయంనిశబ్ద వాతావరణం చోటు చేసుకుని బోసిపోతుండేది.. కానీ ఈ సారి తొలిసారిగా ఆదివారం కూడా కార్యాలయం తెరిచి పనులు జరుగుతుండడంతోఈ ప్రాంతం కళకళలాడుతోంది.. రిజిస్ట్రేషన్ చేసుకునేవారితో సందడిగా నెలకుంది.. వచ్చిపోయేవారితో ఈ ప్రాంతం బిజిగా తయారైంది..ఏది ఏమైనాప్రభుత్వ ఈ నెల 31తో ఆర్థిక సంవత్సరం ముగిస్తుండడంతో వార్షిక ఆదాయం సమకూరే విధంగా ఈ రెండు రోజుల సెలవులో ్ల కూడా కార్యాలయంలోరిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకోవడం విశేషం..

## కంబదహాల్లో ఎద్దుల గిరిక పోటీలు

**: 25,000 వేలు అందించిన వైసీపీ యువనేత నేత సాయికిరణ్ రెడ్డి**
**: మూడో బహుమతి అందించిన టిడిపి యువనేత మురళీకృష్ణ**





**పెద్దకబూరు మార్చి 30 ప్రభాతవార్త :** మండల పరిధిలో కంబదహాల్ గ్రామంలో ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో గ్రామ పెద్దల సహకారంతో ఎద్దుల గిరిక పోటీలను ఆదివారం నిర్వహించారు ఈ పోటీలను వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి తనయుడు సాయికిరణ్ రెడ్డి సందీప్ రెడ్డిలలు ప్రారంభించారు ఈ పోటీలో పాల్గొనేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి ఎనిమిది జతల ఎద్దులు ఎద్దులను యజమానులు తీసుకొచ్చారు హోరాహోరీగా పోటీలు జరిగాయి మొదటి స్థానంలో నిలిచిన ఎద్దులకు వైసీపీ యువ నేత సాయి కిరణ్ రెడ్డి సర్పంచ్ దస్తగిరి15000 రూ లు అందజేశారు రెండోవ బహుమతి కింద ఎనిమిది వేలను గ్రామ పెద్దలు అందజేశారు మూడో బహుమతి కింద 6000 ను టిడిపి యువ నేత మురళీకృష్ణ నాయుడు అందజేశారువైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవ వేడుకలు: కంబదహాల్ గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించు కొని గ్రామంలో వెలిసిన ఆంజనేయ స్వామి రథోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రము గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రథోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి రథోత్సవ వేడుకలు సందర్భంగా స్వాముల వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు సాయంత్రం వైసీపీ నేత పురుషోత్తమ రెడ్డి ఇంటి నుండి మేళ తాళాలతో పూర్ణ కుంభము ఊరేగింపుగా తీసుకువచ్చి స్వాములవారికి నైవేద్యం సమర్పించిన అనంతరము వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవాన్ని లాగారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దస్తగిరి వైసిపి నాయకులు సాయి కిరణ్ రెడ్డి టిడిపి నాయకులు నరసింహారెడ్డి కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి టిడిపి సీనియర్ నాయకులు మునెప్ప మల్దకల్ మురళీకృష్ణ నాయుడు మధు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు

## చిన్నారులను అభినందించిన ముస్లీం మతగురువు



**గడివేముల, మార్చి30, ప్రభాతవార్త;**
మండలకేంద్రమైన గడివేములలో ఆదివారంనాడు సత్తార్ మసీదులో హజరత్ ఇమ్రాన్ నలుగురు చిన్నారులను అభినందించారు. పది సంవత్సరాల నుంచి 12 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు పవిత్రమైన రంజాన్ మాసంలో నెల రోజులు ఉపవాసం ఉండి కఠోర ఉపవాస దీక్షలు చేసి ప్రతిరోజూ ఐదు పూటలా ప్రార్థనలు చేసి ప్రతిరోజూ రాత్రి తరావే నవాజు చదివారు. 30 రోజులు తరావే నవాజులు చదివితే ఒక ఖురాన్ చదివినట్టు అని హజరత్ ఇమ్రాన్ తెలిపారు. 30 రోజులు ఉపవాస దీక్ష చేసిన ఆ చిన్నారులను పలువురు ముస్లీం పెద్ద సత్కరించారు.

## మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పంచాంగ శ్రవణం

**- పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు**



**గడివేముల, మార్చి30, ప్రభాతవార్త;**
గడివేముల మండలవ్యాప్తంగా ఉగాది పండగను పురస్కరించుకుని ఆదివారంనాడు అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల అర్చకులు పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రమైన గడివేములలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద గడివేముల గ్రామ ప్రధాన అర్చకులు కొండూరి ఆదినారాయణశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విశ్వావసు నామ సవత్సరం ఉగాది పంచాంగ శ్రవణంలో భాగంగా ఏ రాశివారికి మేలు జరుగుతుందో ప్రజలకు వివరంగా తెలియజేశారు. ప్రజలు తమ భవిష్యత్‌కు సంబంధించి ఆదాయం, వ్యయం, రాజపూజ్యం, అవమానాలు గురించి అర్చక స్వాములవారిని అడిగి తెలుసుకున్నారు. శ్రీ దుర్గా భోగేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గడిగరేవుల గ్రామంలో దుర్గా భోగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, ఆలయ ఈవో వి.ఎల్.రామానుజన్ ఆధ్వర్యంలో పంచాంగశ్రవణణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాష్టటిడిపి అధ్యక్షులు పల్లశ్రీనివాస్‌ను కలిసిన యువనాయకులు కొమ్మురాజు



**ఆలూరు రూరల్, మార్చి 30, ప్రభాతవార్త**
విజయవాడ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర అధ్యక్షులు పల్లెశ్రీనివాస్ యాదవ్‌ను కలిసి 47సంవత్సరాల తర్వాత ఆలూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌సి రిజర్వు కావడంతో ఈ ఒక్కసారి మాకు అవకాశం కల్పించాలని ఆలూరు టిడిపి యువనాయకులు కొమ్మురాజు కోరారు. గత 30 సంవత్సరాలుగా టిడిపి కోసం తమ కుటుంబం కృషి చేస్తున్నదని, 2014లో తన అన్న రామాంజనేయులు ఎంపిపి అభ్యర్థిగా పోటీ చేయగా స్వల్పమెజార్టీతో ఓడిపోయారన్నారు. ఎలాంటి నిరుత్సాహం చెందకుండ పార్టీకోసం ఎంతగానో కష్టపడ్డామని కొమ్మురాజు వివరించారు. 2019 ననుంచి 2024వరకు వైకాపా ప్రభుత్వం మాకుటుంబాన్ని ఎంతగా ఇబ్బందిపెట్టినా ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండ పార్టీకోసం కష్టపడి పనిచేశామని తెలిపామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు సానుకూలంగా స్పందించి మంత్రి నారాలోకేష్, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతామన్నారు. గతంలో లోకేష్ పాదయాత్రలో హామీ ఇచ్చారని, ఈ విషయం ఆయనతో ప్రస్తావిస్తానని రాష్ట్ర అధ్యక్షులు తెలియజేసినట్లు కొమ్మురాజు తెలిపారు.

## వైభవంగా జనార్ధనస్వామి రథోత్సవం



**ఆస్పరి,మార్చి 30,ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన ఆస్పరిలో వెలసిన శ్రీజనార్ధనస్వామి రథోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. ఆదివారం ఉగాది పండుగ పర్వదినం సంధర్భంగా ఉదయం స్వామివారికి పూలాబిషేకం, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో స్వామివారి పల్లకిని ఊరేగించారు. అనంతరం వీరశేఖర్‌రెడ్డి ఇంటి నుండి కుంభోత్సవాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి రథోత్సవానికి పూజలు చేశారు. అనంతరం రథాన్ని వేలాది భక్తజనులు రథాన్ని ముందుకు లాగారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు ఆస్పరి, చొక్కనహళ్ళి, శంకరబండ, గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మూలింటి రాధమ్మ, మాజీ సోసైటి చైర్మన్ గోవర్ధన్, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహానంది,ఆయకులు ప్రకాష్,తిమ్మప్ప, కేశవరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మూల పెద్దమ్మ ఆలయంలో ఉగాది పండగ శోభ...

**- దర్శనం కోసం బారులు తీరిన భక్తులు - భక్తిశ్రద్ధలతో తెలుగువారి తొలి పండుగ**





**గడివేముల, మార్చి30, ప్రభాతవార్త;**
గడివేముల మండలవ్యాప్తంగా ఆదివారంనాడు ఉగాది పండగ పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. విశ్వావసు నామ సంవత్సర (ఉగాది) పర్వదినం పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గడివేములలోని శ్రీ మూల పెద్దమ్మ తల్లి ఆలయం ఉగాది పండగ శోభను సంతరించుకుంది. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని కాయ, కర్పూరం సమర్పించి, ఆకుపూజలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉగాది పండగ సందర్భంగా ఆలయ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఆలయాన్ని రంగురంగుల పూల అలంకరణలతో మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల్లో పండగ వాతావరణం ఉట్టిపడేలా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఫెస్టివల్ చైర్మన్ దేశం రమణారెడ్డి, ఆలయ ఈవో ఎస్.రామలింగారెడ్డి, ఆలయ ఫెస్టివల్ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా గడివేముల ఎస్‌ఐ సి.సి.నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

**- షడ్రుచుల పచ్చడి...** అన్ని పండగలకూ పిండి వంటలు చేస్తారు. ఉగాది రోజున వాటికితోడు ఉగాది పచ్చడి చేస్తారు. కొత్త చింతపండు, లేత మామిడి ముక్కలు, బెల్లం, వేపపూత, చెరకు ముక్కలు, కారం, ఉప్పు తదితరాలు కలిపి షడ్రుచులతో తయారయ్యే ఈ పచ్చడి ఆరోగ్య, ఆధ్యాత్మిక సందేశాన్ని ఇస్తుంది. జీవితం అన్ని రుచుల సమ్మిళితమని, కష్ట సుఖాలను అనుభవిస్తూ సాగాలనే అర్థం ఇందులో దాగుంది.

## ఎండతీవ్రత నుంచి రక్షణకు ముందుజాగ్రత్తలు పాటించాలి

**- ఆలూరు వైద్యాధికారి డా.రామక్రిష్ణ**



**ఆలూరు రూరల్, మార్చి 30, ప్రభాతవార్త :** వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రతకు గురికాకుండ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆలూరు వైద్యాధికారి డా.రామక్రిష్ణ సూచించారు. ఆయన ఆదివారం ప్రభాతవార్తతో వేసవిలో పాటించవలసిన జాగ్రత్తలు, తీసుకోవలసిన పానీయాలను, వడదెబ్బకు గురికాకుండ ఎలా కాపాడుకోవచ్చు అన్నది వివరించారు.

**ప్రశ్న:** వడదెబ్బలక్షణాలు, జలుబు, తలనొప్పి తల తిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండటం మత్తునిద్ర, కలవరింతలు,ఫిట్స్, అపస్మారకస్థితికి పరిష్కారం ఏమిటి?

**జవాబు:** తెలుపురంగు పలచటి కాటన్ దుస్తులు ధరించాలి, తలకు టోపీ పెట్టుకోవాలి. రుమాలు కట్టుకోవాలి. ఉప్పుకలిపిన మజ్జిగ గ్లూకోజ్ కలిపిన నీటిని తాగాలి. ఒఆర్ఎస్ ద్రావణమును తాగవచ్చు.

**ప్రశ్న:** వడదెబ్బకు గురిఅయిన వారు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?

**జవాబు:** వడదెబ్బ తగిలిన వారిని నీడగా ఉన్న చల్లటి ప్రాంతానికి వెంటనే చేర్చాలి. వడదెబ్బకు గురి అయిన వారిని తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. ఐస్‌వాటర్ బట్టతో శరీరమంతా తుడవాలి, శరీర ఉష్ణోగ్రత 101డిగ్రీ కంటె లోపు వచ్చేవరకు ఐస్‌వాటర్ బట్టతో శరీరాన్ని తుడుస్తూ ఉండాలి. ఫ్యాన్ క్రింద ఉండాలి. వడదెబ్బకు గురి అయిన వారు సాధారణ స్థితికి రానిచో వారిని దగ్గరిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించాలి

**ప్రశ్న:** మంచినీరు ఎక్కువ మార్లు త్రాగాలా?

**జవాబు:** ఇంటినుంచి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు మంచి నీరు తాగాలి. ఎండనుంచి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు, చల్లని నీరు తాగాలి. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలతిరగడం, తదితర అనారోగ్యసమస్యలు ఉత్పన్నమైతే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొంది వడదెబ్బ బారినపడకుండ కాపాడుకోవచ్చు.

**ప్రశ్న:** ఎండతీవ్రంగా ఉన్నప్పుడు చేయకూడనివి ఏవి?

**జవాబు:** సూర్యకిరణాలు, వేడిగాలికి గురికాకూడదు. వేడిగా ఉన్న సూర్యకాంతిలో గొడుగులేకుండ తిరగరాదు. వేసవికాలంలో నలుపురంగు దుస్తులు ధరించరాదు. తలకు టోపీ, రుమాలు లేకుండ తిరగరాదు.వడదెబ్బకు గురైన వారిని వేడినీటిలో ముంచిన గుడ్డతో తుడవరాదు.వడదెబ్బ లక్షణాలు కలిగిన వారిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించడంలో జాప్యం చేయరాదు. మధ్యాహ్నం తర్వాత(ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల కాలంలో) ఆరు బయట ఎక్కువగా శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు. ఎండలో బయట నిల్చొని వచ్చిన వెంటనే తీపి పదార్థాలు, శీతల పానీయాలు, ఐస్ ముక్కల వంటివి తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్యం ఏర్పడుతుంది. వడదెబ్బకు గురికాకుండ ప్రజలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సూచనలను పాటించి అందరు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని రామక్రిష్ణ సూచించారు.

## ఊరూరా ఉగాది వేడుకలు



**కొత్తపల్లె, మార్చి 30, ప్రభాతవార్త:** కొత్తపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఊరూరా ఉగాది వేడుకలను ప్రజలు ఆదివారం సంతోషాల నడుమ జరుపుకున్నారు. ప్రాతకాలం నుంచే మహిళలు, యువతులు ఉపవాసాలతో దేవతామూర్తులకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. గ్రామాల్లోని ఆలయాలు భక్తుల పూజలతో అలరించాయి. సింగరాజుపల్లె గ్రామంలో కొలనుభారతిదేవి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ, కొత్తపల్లె మండల కేంద్రంలోని తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు శ్రీనివాస ఆచారి, మల్లిఖార్జున ఆచారి, రామాలయంలో యాదవవేని లక్ష్మినరసయ్య శర్మ, ఇతర గ్రామాల్లో అయా గ్రామ పురోహితులు తెలుగు సంవత్సరాది నూతన పంచాంగ శ్రవణం చేశారు.

## రెడ్‌క్రాస్ నాగశేషయ్యకు ఉగాది పురస్కారం



**నంద్యాల, మార్చి 30, ప్రభాతవార్త ప్రతినిధి**
నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణంలో ఉన్న పిజిఆర్ఎస్ హాలు నందు ఆదివారం అధికారయంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా బ్రాంచ్ కార్యవర్గసభ్యుడు, శ్రీశైలం సబ్‌బ్రాంచ్ చైర్మన్ నాగశేషయ్యకు రాష్ట్రన్యాయశాఖ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్, రోడ్లుభవనాలు, పెట్టుబడులు, మౌలికసదుపాయాలశాఖ మంత్రి బిసి.జనార్దనరెడ్డి, జిల్లా కలెక్టరు జి.రాజకుమారి, జిల్లా జాయింటు కలెక్టరు విష్ణుచరణ్ చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ కమిటీ నాగశేషయ్యను అభినందించింది.

## బుడగజంగాల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఐఈడి కో-ఆర్డీనేటర్



**నంద్యాల హాస్పటల్,మార్చి 30,ప్రభాతవార్త:**
పట్టణంలోని నందమూరి నగర్‌లోని స్టార్ సొసైటీ ద్వారా నపిర్వహించబడుతున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవాసియ విద్యాలయమును బుడగజంగాల రాష్ట్ర సమగ్ర శిక్ష ఐ.ఈ.డి.కో-ఆర్డీనేటర్ కల్పన అకస్మిక తనిఖీ చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించి విద్యార్థులకు మెను ప్రకారం ఆహారం ఇస్తున్నారా లేదా అలాగే వారి ఆరోగ్య పరిస్థితులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని అలాగే సిసి కెమరాలు, ఫ్యాన్లు తప్పని సరిగా ఉండాలని,విద్యార్థినీలకు, విద్యార్థులకు వేరువేరుగా టాయిలెట్స్ ఉండాలని నిర్వాహకులను ఆదేశించారు. హాస్టల్ నందు 100 మంది విద్యార్థులు ఉండడం, నిర్వాహకుల పనితీరు పట్ల ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. నిర్వాహకులు పిల్లల కొరకు ఇంటి అద్దెలు,రవాణా సౌకరార్థం వెహికిల్ ఏర్పాటు చేశామని ఆమెకు తెలిపారు. దీనిపై ఐఈడి కో-ఆర్డీనేటర్ స్పంధిస్తూ వీటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని నిర్వాహకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పి.హిమశేఖర్, చంద్రమ్మ, గాయత్రి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్టీయు ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం



**కర్నూలు విద్య, మార్చి 30, ప్రభాతవార్త:**
ఎస్టీయు ఆధ్వర్యంలో ఉగాది పంచాంగశ్రవణం ఎస్టీయు భవన్ నందు జిల్లా అధ్యక్షుడు ఎస్ గోకారి అధ్యక్షతన నిర్వహించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు హిరాలాల్ పురోహితుడుగా వ్యవహారించి పంచాంగ పఠనం గావించారు. విశ్వావు నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా పడి పంటు బాగ పండుతాయని పత్తికి మంచి ధర ఉంటుందని రాశి ఫలాలు పలైట్ల చదివి వినిపించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోకారి మాట్లాడుతూ చైత్రమాసం శుక్లం పాడ్యమి రోజున బ్రహ్మ ఈ జగత్తును సృష్టించాడని నమ్ముతారని సోమకుడు వేదాలను తస్కరించిన కారణంగా మత్స్యావతారం ధరించి విష్ణువు అతడిని సంహరించి వాటిని తిరిగి బ్రహ్మదేవుడికి అప్పగించిన సందర్భంగా ఉగాది ఆచరణలోకి వచ్చిందని పురాణ ప్రతీతి అని అన్నారు. ఉగాది రోజు ముఖ్యమైన వంటకం ఉగాది పచ్చడి షడ్రచుల సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుంది. బెల్లం-తీపి- ఆనందానికి ప్రతీక, ఉప్పు- జీవితంలో ఉత్సాహం రుచికి సంకేతం. వేప పువ్వు-చేదు-బాధను కలిగించే అనుభవాలు. చింతపండు-పులుసు- నేర్పుగా వ్యవహారించాల్సిన పరిస్థితులు. పచ్చిమామిడి ముక్కలు-వగరు-కొత్త సవాళ్లు. కారం- సహనం కోల్పోయేటట్లు చేసే పరిస్థితులు తెలియజేస్తారన్నారు. ఉగాది పచ్చడి ఈపండుగలో ప్రత్యేకమైన వంటకం. ఇది షడ్రుచుల సమ్మేళనం. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్ధన్ సీనియర్ నాయకులు నాగయ్యగుప్తా, శ్రీధర్, సురేష్, హుస్సేన్‌మియ్య, ఏళ్ళ నాగరాజు, మూర్తుజ వలి, బాలకృష్ణ గోవింద్, గోవింద్‌నాయక్, శాంతమూర్తి, దేవదాసు, నాగరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పేరుసోములలో ఇంటి అడుగు బాగాన పురాతన శివాలయం







**పేరుసోమల(కోవెలకుంట్ల) మార్చి 30,ప్రభాతవార్త**
పూర్వము రాజుల కాలంఅంతకుకు మునుపు నివాసులు ఎన్నో అలయాలను నిర్మాణము చేపట్టారు. అయితే యుగాలు మారడము నాటి ఇళ్ల గోపురాలు,దేవాలయాలు భూగర్భములో కలిసి పోయాయి. అయితే నేటి కలియుగము అలనాటి అలయాలు ఒక్కొక్క బయట పడుతున్నాయి. అలాంటి సంఘటన పేరుసోమల గ్రామంలో చోటు చేసుకుంది. పేరుసోమల గ్రామంలోని బేస్త మద్దిలేటి అనే వ్యక్తి ఇంటి కింద బాగాన శివాలయం ఉందని ఒక అజ్ఞాత వ్యక్తి అతని సూచించడము జరిగింది. అయన చెప్పినసప్పటి నుండి మద్దిలేటి ఇంటిలో కొన్ని సూచనలు కనిపించడము ఇంట్లో భూమి కంపించడము లాంటివి చోటు చేసుకుంటుండగా మద్దిలేటి అయ ఇంటికి ఖాళీ చేసి వేరొక చోట నివాసముముంటున్నారు. ఇలాంటి తరుణంలోగత రెండు రోజులక్రింద ఇంట్లో పెద్ద గొయ్యి ఏర్పడిందని మద్దిలేటి చెప్పారు. అ గొయ్యి మేము త్రొవ్వకుండా బారీ ఏర్నడము జరిగిందన్నారు. తీరా లోపలికి వెళ్లి చూడగ పురాతన కాలం నాటి శివాలయం కనిపి ంచిందని చెప్పారు. దీనితో అలయంలో ఉన్న శివలింగానికి పూజలు చేస్తున్నామని చెప్పారు. అనంతరము గ్రామస్తులంతా తండోపతండాలు తరలి వచ్చి గొయ్యిలో ఏర్పడిన శివాలయాన్ని చూసి అక్కడున్న శివలింగానికి పూజలు చేయడము ప్రారంబించారు.

## దేవదాయశాఖ ఈఓగా సాయికుమార్



**నందికొట్కూరు,మార్చి 30,ప్రభాతవార్త:** నందికొట్కూరు దేవదాయధర్మశాఖ గ్రూప్-4 ఆలయాల ఈఓగా ఏ.సాయికుమార్ నియమితులయ్యారు. గత ఇక్కడ పనిచేసిన వెంకటరమణ స్థానంలో మంత్రాలయంలో గ్రూప్ టెంపుల్స్ ఈఓగా పనిచేస్తున్న సాయికుమార్ ఇక్కడికి బదిలి అయ్యారు. ఈయన సోమవారం భాధ్యతలు చేపడుతున్నట్లుగా తెలిసింది.

## నేడు లక్ష్మాపురంలో వృషభరాజముల బలప్రదర్శన పోటీలు

**పగిడ్యాల, మార్చి 30,ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మాపురంలో ఉగాధిపండుగ పురష్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో నాలుగు పండ్ల లోపు వృషభరాజముల బలప్రదర్శన పోటీలు సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజేతైన వృషభరాజముల యజమానులకు మొదటి బహుమతి రూ. 30,000లు రెండవ బహుమతి రూ. 20,000లు మూడవ బహుమతి రూ. 15,000లు నాల్గవ బహుమతి రూ. 10,000లు, ఐదవ బహుమతి రూ. 5,000లు దాతల చేతులమీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. ఆశక్తిగల వృషభరాజముల యాజమానులు రూ. 500లు ప్రవేశరుసుము చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలనీ, ఈ క్రింది సెల్ నెంబర్లు ఇ.మద్దిలేటిగౌడు, 7702627036, ఎన్.భూషిగౌడు 9177589259, కె.గోవిందు 9701631367,ఎన్.రాఘవేంద్రగౌడు 8790107283,ఎస్.నరసింహా 8142943791 సంప్రదించాలనీ కోరారు.

## భక్తి శ్రర్ధలతో ముగిసిన తెలుగు సంవత్సరాది పండుగ వేడుకలు



**నంద్యాల, కోవెలకుంట్ల, మార్చి 30,ప్రబాతవార్తప్రతినిధి**
నంద్యాల జిల్లా వ్యాప్తంగా తెలుగు సంవత్సరాది పండుగ వేడుకలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్తఅళ్లులు కోడళ్లతో ఇంటిల్లి పాటి ఈ వేడుకల్లో పాల్గొన్ని అయా గ్రామాల్లో వెలసిన గ్రామ దేవతలకు పూజలు చేశారు. ముఖ్యంగా నందవరము గ్రామంలో చౌడేశ్వరీ దేవీ అలయంలో ఎంతో భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ ఏడాది అంతా పాడి పంటలు, పశుపక్షాతులు క్షేమంగ ఉంగాలని అయా దేవతలకు పూజలు చేశారు గ్రామాల్లో ఉన్న దేవతలకు బలులు అర్పించారు.

వార్త



# మారేది..ఎన్నడు..!?

: పాత మామిడి తోరణాలను తొలగించే ఓపిక లేదా..
: ఎక్కడ చూసినా అపరిశుభ్రత..







మిడుతూరు మార్చి 30 ప్రభాతవార్త: కాపలా లేని చేను, ధర్మకర్త లేని దేవాలయం దుస్థితి ఎలా ఉంటుందో ఈ దేవాలయం ఒక ఉదాహరణ. పెద్దలు.... సాంప్రదాయం, సనాతన ధర్మం, దైవభక్తి, దైవచింతన, అంటూ వాటి ప్రాధాన్యత ఇవ్వాలని అంటుంటారు. అందులో ఎలాంటి తప్పులేదు. కానీ ఉన్న సాంప్రదాయాలను పట్టించుకోకుండా, నిర్లక్ష్యం చేయడం పట్ల ఏమనాలి? ఇది మహా తప్పు కదా ఉన్న సాంప్రదాయాలు మరుగున పడకుండా కాపాడుకుంటే అన్నీ ఒకదానికొకటి సాంప్రదాయాలు అమలవుతాయి. కొత్త ఆలోచనలు వద్దు, కొత్త పద్ధతులు వద్దు, ఉన్న వాటిని సక్రమంగా అమలుపరిస్తే చాలు అంతకుమించిన సాంప్రదాయ ధర్మం మరొకటి లేదు కదా. దేవాలయ పరిస్థితి మారేది ఎన్నడు? మండల కేంద్రమైన మిడుతూరులో వెలసిన చారిత్రాత్మక దేవాలయం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి దాదాపు 117 ఎకరాల మాన్యం ఉంది. ఈ మాన్యం ద్వారా కౌలు రూపంలో లక్షల్లో డబ్బులు జమవుతాయి. కానీ దేవాలయ పరిసర ప్రాంతాలను, శుభ్రపరిచే విధానంలో ఎంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. చివరికి తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ పర్వదినాన కూడా దేవాలయానికి మావిడాకులు ముందు భాగంలో ఒక తోరణం మాత్రమే కట్టారు. సరే ఇది ఇలా ఉంచితే గతంలో ఎప్పుడో దేవాలయ ప్రధాన ద్వారానికి కట్టిన ఎండిన మామిడి తోరణం కూడా తొలగించ లేదంటే ఇది ఎవరి నిర్లక్ష్యం, అంతేకాకుండా దేవాలయం లోపల ఆవరణలో పలుచోట్ల చెత్తాచెదారం అలాగే ఉంది. కనీసం ప్రధాన పండుగ కు ముందు దేవాలయం పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఎండోమెంట్ అధికారులకు లేదా. ఉంటే మరి నిర్లక్ష్యం ఏమిటి. అసలు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయానికి ఈవో ఉన్నారా. మరి ఉంటే ఇలాంటి పరిస్థితి ఎందుకు దాపరించింది. ఎవరు ఏమి అనరులే అని నిర్లక్ష్యమా. ప్రతి పండుగకు దేవాలయం పరిస్థితి ఇలాగే ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దేవాలయ పొలం ద్వారా కౌ లు రూపంలో లక్షల్లో డబ్బులు వస్తున్న దేవాలయ పరిశుభ్రతపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు అని పలువురు అంటున్నారు. అంతేకాకుండా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవునికి, దేవాలయానికి సేవ చేయడానికి, అంటే దేవుని సేవ చేసే ప్రతి ఒక్కరికి ప్రత్యేక మాన్యాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ఎండోమెంట్ అధికారులు స్పందించి భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చూసుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

# పేరుకుపోయిన.. డ్రైనేజీ..!


: దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
: మురికి నీరు ఇళ్లల్లోకి వచ్చిన పట్టించుకోరా...

పెద్దకడబూరు మార్చ్ 30 ప్రభాతవార్త: మండల కేంద్రమైన పెద్దకడబూరు లో పోలీస్ స్టేషన్ కు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఎస్సీ కాలనీ నందు అంబేద్కర్ విగ్రహానికి సమీపంలో ఉన్న డ్రైనేజీ చెత్త చెదారంతో నిండిపోయి దుర్వాసన వస్తున్న ఎవరు పట్టించుకోవడంలేదని కాలినీవాసులు ఆదివారం విలేకరుల ముందు వాపోయారు డ్రైనేజీ పక్కనే మంచినీటి కులాయి ఉండడం వల్ల డ్రైనేజీ మురికి నీరు కొల్లాయి చుట్టూ చేరడంతో మంచినీళ్లు పట్టుకునేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నీరు కలుషితమై రోగాల బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని కాలినీ వాసులు ప్రశ్నిస్తున్నారు ఈ డ్రైనేజీ నిండిపోయింది ఎక్కడో గ్రామంలో మారుమూల కాలనీలో కాదు నిత్యం ప్రజలు తిరిగే పోలీస్ స్టేషన్ కి వెళ్లే దారిలో డ్రైనేజీ అస్తవ్యస్తమై మురికి నీరు ఇళ్ల ముందుకు వస్తున్న తాము ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నామని ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు చెప్పిన పట్టించుకునే నాధుడే కరువ య్యారని కాలినీ వాసులు మండిపడు తున్నారు రోడ్డు వెంబడి అన్ని చోట్ల డ్రైనేజీ శుభ్రపరిచి తమ అయిదారు ఇల్లు ముందు మాత్రమే డ్రైనేజ్ పూడికను తీసివేయకుండా వదిలేయడం ఏమిటని మహిళలు ప్రశ్నిస్తున్నారు దుర్వాసనతో ఇళ్లకు డోర్లు వేసి ఇళ్లలోనే ఉండే పరిస్థితి నెలకొందని పలువురు కాలనీ వాసులు వాపోతున్నారు మీరు ఒక్కటే మని షులా మేము మనుషులు కాదా మేము ఓట్లు వేయలేదా ఎందుకు మా సమస్యలు పట్టించుకోవడంలేదని అక్కడ ఉన్న మహిళలు పాలకులను నిలదీ స్తున్నారు దుర్వాసనతో తమ పిల్లలు అనారోగ్యానికి గురైతే పాలకులే బాధ్యత వహించాలని మహిళలు హెచ్చరిస్తున్నారు ఇప్పటికైనా తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి చెత్తాచెదారంతో పేరుకు పోయిన డ్రైనేజీని శుభ్రపరిచి తమ ఆరోగ్యాలను కాపాడాలని కలియుని వాసులు కోరుతున్నారు లేకపోతే ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు



# ఆలూరు మారెమ్మ అవ్వకు.. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

: విశ్వావసు నామ సంవత్సరంలో అందరికీ మేలు జరగాలి



చిప్పగిరి, మార్చి, 30, ప్రభాతవార్త : నూతన తెలుగు సంవత్సరం విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగనుపురస్కరించుకొని ఆలూరు వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆదివారం తాలూరు మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.సోదరులు బుసినే శ్రీరాములు,బుసినే వెంకటేష్ తాలూరు మారెమ్మ అవ్వ ని దర్శించుకొని,ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కలు తీర్చుకున్న అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే విరుపాక్షిని ప్రత్యేకంగా దైవ ఆశీర్వాదం అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వ వసు నామ సంవత్సరములు ఎమ్మెల్యే విరుపాక్షి కుటుంబ సభ్యుల అందరికీ మారెమ్మ ఆశీస్సులు మెండగా ఉండాలని ఆశీర్వదించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఉగాది తెలుగు నూతన విశ్వనామ సంవత్సరములో నియోజకవర్గంలో ప్రజలందరూ చల్లగా ఉండాలని అలాగే వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని మారెమ్మ అవును కోరుకున్నట్లు తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా, రంజాన్ పండుగ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు.

# సి.యం.రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నందికొట్కూరు,మార్చి 30,ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్య దృష్ట్యా అందజేస్తున్న ముఖ్యమంత్రి సహాయ రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన వడ్డే లక్ష్మీదేవికి మంజూరు సి.యం.రిలీఫ్ ఫండ్ రూ.1.62లక్షల చెక్కును, అలాగే సయ్యద్ రంజాబీ కి మంజూరు అయిన రూ.3,07,684 చెక్కును వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, ఖాజా హేశ్శన్, లాడెన్,పుల్లన్న, రాంబాబు, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

: సిఐ మంజునాథ్..



కోసిగి, మార్చి 30, ప్రభాతవార్త ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా యువత తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోసిగి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మంజునాథ్ తెలిపారు..బెట్టింగ్ ఆడుతూ సర్వం కోల్పోయిన యువతకు ఆయన సూచనలు ఇచ్చారు.. బెట్టింగ్ అంటే జూదమేనని, బెట్టింగ్‌లో లక్షలాది రూపాయలు కోల్పోయి చాలా మంది యువకులు ఆత్మహత్యలు చేసుకున్నార న్నారు.. బెట్టింగ్‌లో అనేక రకాలు ఉన్నాయని క్రికెట్ బెట్టింగ్ వీటిలో ప్రధానమైనదన్నారు.. ఇకపోతేపేకాటలో ఓడిపోయి లక్షల్లో పోగొట్టుకున్న వారు ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలు చాలా ఉన్నాయన్నారు.. క్రికెట్ వినోదమైనదేనని గతంలోక్రికెట్ మైదానంలో జరిగే ఆటను టెలివిజన్ ఛానల్స్‌లోను, సెల్‌ఫోన్‌లో చూసి ఆనందించేవారన్నారు.. క్రీడ అనేది వినోదం కోసమేనని, అయితేదాన్ని జూదంగా పరిగణిస్తే మాత్రం జీవితాలను నాశనం చేసుకున్నవారవుతారని తెలిపారు.. ఇప్పుడు ఆన్‌లైన్ వచ్చిన తరువాత ఆటలు కూడాఆన్‌లైన్‌లోనే సాగుతున్నాయని, దీంతో సులభంగా డబ్బులు సంపాదించేందుకు యువత ఇలాంఇ మార్గాలు ఎంచుకుంటున్నారనా న్నరు..కావునతల్లిదండ్రులు అందరూ పిల్లలు మొబైల్‌ను ఏ విధంగా వాడుతున్నారు.. ఏం చేస్తున్నారు అని ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని కోరారు..యువతీ యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని సిఐ మంజునాథ్ తెలియజేసారు..

# అఖిలభారతస్థాయి బండలాగుడు పోటీలు



: ప్రథమస్థానంలో నిలిచిన పచ్చర్లగ్రామం వృషభరాజములు

పగిడ్యాల, మార్చి 30,ప్రభాతావర్త నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామములో ఉగాది - రైతు సంబరాలు సందర్భంగా అఖలభారత స్థాయిలో వృషభరాజముల న్యూక్యాటగిరి పోటీలను ఆదివారం ఎంఎల్ఏ గిత్త జయసూర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఉగాధి సంబరాలలో బాగంగా ఒంగోలు జాతి వృషభరాజముల పోటీలను నిర్వహకులు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా పచ్చర్లకు చెందిన పి.సతీష్‌కుమార్‌రెడ్డి వృషభరాజములు 20నిముషాలకు 3300 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం నారాయణపేట్ జిల్లా జక్కిలేరుకు చెందిన డాక్టర్ రషీద్‌బాష వృషభరాజములు 3135.9 అడుగుల దూరం బండను లాగి రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా ఎన్. కొత్తపల్లెకు చెందిన చల్లా హారిక వృషభరాజములు 3082.10 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలిచాయి. కర్నూలు మండలం పి. రుద్రవరంకు చెందిన గోపాల్‌గౌడు వృషభరాజములు 2990.6 అడుగుల దూరం లాగి నాల్గవస్థానంలో నిలిచాయి. నంది కొట్కూరుకు చెందిన చాబోలు చిన్న శాలుమియ్యకు చెందిన వృషభరాజములు 2769.5 అడుగులదూరం లాగి ఐదవస్థానంలో నిలిచాయి. డోన్ మండలం మల్యాల షేక్‌మున్నా, తెలంగాణ రాష్ట్రం నారాయణపేట్ జిల్లా జక్కిలేరు డాక్టర్ రషీద్ భాషకు చెందిన వృషభరాజములు 2715.4 అడుగుల దారం లాగి ఆరవస్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ. 40వేలు (దాతలు : ఎస్.పెద్ద బాలన్నకుమారుడు కిరణ్‌కుమార్ కొణిదేల పెట్రోల్ బంక్ యజమాన్యం ) రెండవ బహుతి రూ. రూ. 30వేలు (దాతలు : పగిడ్యాల దామోదరెడ్డి రూ. 10వేలు, లక్ష్మాపురం సిఎం సమీన్ రూ. రూ.10వేలు, లక్ష్మాపురం యం.కృష్ణ మద్దిలేటి రూ. 10వేలు) మూడవ బహుమతి రూ. 20వేలు (దాత : శిరిగిరి ఉశేనాలం 6వవార్డు సభ్యులు) నాల్గవ బహుమతి రూ. 15వేలు (దాతలు : యర్రం వెంకటరెడ్డి రూ. 5వేలు, ప్రాతకోట కీ.శే. గట్టన్న కుమారుడు వెంకటేశ్వర్లు రూ. 5వేలు, ప్రాతకోట బాల్వీరగౌడు రూ. 5వేలు) ఐదవ బహుమతి రూ. 12వేలు (దాతలు : నందికొట్కూరు ఆగ్రోకెమికల్స్ యం. రవిశంకర్ ) ఆరవ బహుమతి రూ. 8వేలు (దాత : కీ.శే. భీమిశెట్టి విజయ్‌కుమార్ గారి కుమారుడు తేజ రూ. 5వేలు, ప్రాతకోట హార్డువేర్ కె.భూపాల్ రూ.3వేలు) విజేతలైన వృషభరాజముల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ వ్యాక్యాతలుగా వాడాల రామనాయుడు, అబ్దుల్ కలాం వ్యవహరిచారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపిటిసి ఈడిగె గౌరమ్మ, బొగు ్గల దామోదరెడ్డి, యువనాయకులు ఇ.మద్దిలేటి గౌడు , సిఎం సమీన్, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి గోవిందు, అయ్యన్న , ఎస్ వంకటేశ్వర్లు, వార్డు సభ్యులు ఉశేనాలం, అర్జునరావు, నంద్యాల భూషిగౌడు, రాముడుగౌడు, రాఘవేంద్ర గౌడు, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరు సుఖ సంతోషాలతో జీవించాలి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కల్లూరు, మార్చి 30, ప్రభాతవార్త: ప్రజలందరు సుఖ సంతోషాలతో జీవించాలని కల్లూరులో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని భూపాల్‌రెడ్డి మరియు కాటసాని ఉమా మహేశ్వరమ్మలు. అనంతరం వారు మాటా ్లడుతూ ఇటిల్లిపాది ఘనంగా ఉగాది పండుగను జరుపుకోవాలని అందరికి ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు ఉండేలా ప్రజలకు శ్రీవిశ్వావసు నామ సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈకార ్యక్రమంలో కార్పొరేటర్‌లు, కల్లూరు గ్రామనాయకులు ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి



కల్లూరు, మార్చి30, ప్రభాతవార్త: ఉగాది పండుగ పురస్కరించుకొని కల్లూరులో చౌడేశ్వరీ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఉమ్మడి జిల్లా టిడిపి సీనియర్‌నాయకులు నందికొట్కూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జీ గౌరు వెంకటరెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారందరికి శ్రీవిశ్వావసు నామ సంవత ్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అందరు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కల్లూరు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# నాగలాపురం సుంకులమ్మ అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి పూజలు



వెల్దుర్తి,మార్చి30,ప్రభాతవార్త నాగలాపురం సుంకులమ్మ అమ్మవారికి పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి, కంగాటి వాసంతమ్మతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.విశ్వాసునామ ఉగాది పండుగతో ప్రజల జీవితాల్లో కొత్తరంగులు తీసుకురావాలని ప్రతిక్షణం ఆనందంతో నిండిన జీవితాన్ని అందించా లని సకాలంలో వర్షాలు కురవాలని, పత్తికొండ నియోజకవర్గంలోని ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలని ఆ అమ్మవారికి కోరుకున్నామని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి తెలిపారు.అదేవిధంగా పత్తికొండ నియోజకవర్గంలోని వైకాపా నాయకులకు,కార్యకర్తలకు,నియోజకవర్గ ప్రజలకు ఆమె ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# రంజాన్ వేడుకలకు హాజరవుతున్న ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు,మార్చి30,ప్రభాతవార్త: నేడు పట్టణంలో జరిగే రంజాన్ పండుగను వేడుకల సందర్భంగా శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీ సోదరులకు ప్రత్యేకాభినందనలు తెలియజేసేందుకు హాజరవుతున్నారు. ముందుగా నంద్యాల టర్నింగ్‌లోని ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి మైనార్టీ సోదరులు ప్రత్యేక ప్రార్థనాలు ముగించుకోని తమ పెద్దలను గుర్తు చేసుకునేందుకు కబరస్తాన్‌కు వెళ్లే క్రమంలో ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ పండుగ పర్వదినం సందర్భంగా కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఈ వేడుకలో మైనార్టీ నాయకులు అధిక సంఖ్యలో హాజరవుతున్నట్లు తెలసింది. పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు స్నేహ పూర్వకమైన అభినందనలు తెలియజేసేందుకు ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి నేడు పట్టణంలో మైనార్టీ సోదరులను కలసి రంజాన్ శుభాక్షాంక్షలు తెలియజేయనున్నారు.

# దుఖాణం స్థలం కోసం టిడిపి కార్యకర్తలపై వైసిపి చోటా నాయకులు దాడి



నంద్యాల, మార్చి 30,ప్రబాతవార్తప్రతినిధి మహానందిలో ఒక దుఖాణం స్థలంలో టెండరు వేసుకునే సమయంలో వైసిపి,తెలుగు దేశంనాయకులు మద్య బారీ ఘర్షణ చోటు చేసుకోగా అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షక పాత్ర వహించినట్లు సమాచారము.వివరాలోకి వెల్లితే శ్రీశైలం నియోజక వర్గంలోని మహానంది క్షేత్రము ఒక దుఖాణం టెండరు వేయడానికి పిలువగా అ టెండరు వేయడనికి కేవలము గిరిజనులకు మాత్రమే అర్హత ఉంది. దీనితో అ దుఖాణం టెండరు దక్కించుకోవడనికి వైసిపి.తెలుగుదేశం చోట నాయకులు గిరిజనుడిని అడ్డుపెట్టుకుని వేలంలో పాల్గొన్నారు. ఈసమయంలో అక్కడ బారీగా పోలీసులు కూడా బందోబస్తు ఏర్పాటు చేశారు. గిరిజనుడిని అడ్డుపెట్టుకుని వైసిపి నాయకులు రౌడీజం చేసినట్లు సమాచారము అయితే ఇక్కడ వైసిపి చోట నాయకులు చెయ్యి పైచోయ్యి కావడముతో టిడిపి నాయకులపై కుర్చిలతో దాడి చేసినట్లు తెలుస్తోంది.ప్రశాంతము ఉన్నమహానందిలో అలజడి లేపి సరే అదుఖాణ స్థలాన్ని ఎలాగైన దకి ్కంచుకునేందుకు రౌడీ మూకలు రెచ్చిపోయాయి అందులో బాగంగా ముందస్తు పథకము ప్రకారము ఇతర గ్రామాల నుండి రౌడీ మూకలను టెండరు దగ్గరికి పిలిపించుకుని వైసిపి నాయకులు దాడికి పాల్పడినట్లు చెబుతున్నారు. ఇదంతా సాక్షాత్తు పోలీసుల సాక్షిగనే జరిగిందని తెలుస్తోంది. వారి సమక్షంలోనే కుర్చిలతో బరితెగించి దాడి చేశారని బాదితులు అంటున్నారు. మరి ఈటెండరులో పాల్గొన్న నాయకులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటాకో వేచి చూద్దాంమరీ?

# రంజాన్ తోఫా కిట్లు పంపిణి చేసిన టీజీ భరత్



కర్నూలు హాస్పిటల్, మార్చి 30, ప్రభాతవార్త: పేదలకు మంచి చేయాలన్న తపన అందరిలో రావాలని రాష్ట్ర పరి శ్రమలు వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని రోజాప్రాంతంలో షేర్ షా సూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఉచితంగా రంజాన్ తోఫా కిట్లు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొని స్థానికులకు కిట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షేర్ షా సూరి చారిటబుల ్ ట్రస్ట్ తరుపున 500 మందికి రంజాన్ తోఫా కిట్లు పంపిణిచేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ట్రస్ట్ తరుపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని చైర్మన్ సూరి, మన్సూర్ అలిఖాన్‌లను అభినందించారు. రానున్న రోజులో ్ల మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.

# శ్రీసుంకులాపరమేశ్వరీదేవి గుడి వద్ద బారులుతీరిన భక్తులు




నందికొట్కూరు,మార్చి 30,ప్రభాతవార్త: శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ సంధర్భంగా పట్టణంలో వెలసిన శ్రీసుంకులాపరమేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకునేందు భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయం వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భంధోబస్తు ఏర్పాటు చేశారు.

# పండిత సత్కారం



శ్రీశైలంప్రాజెక్టు,మార్చి30,ప్రభాతావార్త ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకోని ఆదివారంనాడు ఆలయ ప్రాంగణములోని అక్కమహాదేవి అలంకార మండపంలో సంప్రదాయబద్ధంగా పండితసత్కార కార్యక్రమం జరిపించబడింది.ఈ సత్కార కార్యక్రమములో ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, అర్చకులకు స్థానాచార్యులకు (అధ్యాపకవారికి)వేదపండింతులకు శాలువా,నూతన పంచాంగం,కొబ్బరిబొండం మొదలైనవాటిని అందజేసి సంప్రదాయబద్ధంగా సత్కరించడం జరిగింది.అదే విధంగా పండిత సత్కార కార్యక్రమంలో భాగంగా దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి శ్రీపండితబుట్టే వీరభద్రదైవజ్ఞవారిని కూడా సత్కరించడం జరిగింది.

# గ్రామ గ్రామనా ఉగాది పండుగ సంబరాలు



బనగానపల్లె, మార్చి30, ప్రభాతవార్త: మండలంలోని పట్టణంతోపాటు అన్ని గ్రామాల్లో ఉగాది పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పట్టణం, గ్రామాల్లోని అమ్మవారికి వేకువజాము నుండి మహిళలు కాయకార్పురంతో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అందులో భాగంగా బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె, పలుకూరు, రామతీర్థం, బనగానపల్లె పట్టణంలో ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీ సీతారాముల విగ్రహాలను పల్లకి పై ప్రత్యేకంగా అలంకరించి పట్టణం, గ్రామాల్లో ప్రధాన వీధుల్లో ఊరేగించడం జరిగింది. శ్రీ సీతారాముల విగ్రహాలు ఇంటి వద్దకు రాగానే మహిళలు కాయకార్పురంతో స్వామివారికి స్వాగతం పలికారు. స్వామి సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యాగంటిపల్లె గ్రామ ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి, బండి కుమారస్వామిరెడ్డి, యామ చిన్న పుల్లారెడ్డి, నంద్యాల నాగేశ్వరరెడ్డి, బండి భాస్కర్‌రెడ్డి, సోమన్నగారి వెంకటసుబ్బారెడ్డి, యామ రామకృష్ణారెడ్డి, గాలి నాగసుబ్బారెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.